సందడిగా సంత

సాధారణంగా సంతలనేవి పల్లెల్లోనే చూస్తుంటాం. ఇంటికి కావాల్సిన అనేక నిత్యావసరాలు ఒకే చోట రాశులు పోసి తక్కువ ధరకు విక్రయించటం సంతల ముఖ్య ఉద్దేశం. అయితే నగరంలోనూ సంత జరగటం ఒక రకంగా ఆశ్చర్యమే అని చెప్పాలి. అయితే జీవీఎంసీ 51వ వార్డు మాధవధార 48 లాస్ట్ బస్టాప్ మొదలుకుని అరకిలోమీటర్ మేర రహదారికి ఇరువైపుల వారానికి ఒక రోజు సంత జరుగుతుంటుంది. చిన్నాపెద్దా అంతా ఈ సంతలో తమకు కావాల్సినవి కొనుగోలు చేసుకుంటారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వ్యాపారులు తమ సరుకును విక్రయించి లాభాలతో ఇంటి బాట పడతారు.



చీపుర్లు, ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న యువకుడు



ప్లాస్టిక్ పూల దండలు, ఫ్లవర్‌వాజులు విక్రయిస్తున్న మహిళ

- 51వ వార్డు మాధవధార 48వ నంబర్ బస్టాప్ వద్ద ప్రతి వారం నిర్వహణ
- తక్కువ ధరకే లభ్యమయ్యే వస్తువులు
- స్థానికుల నుంచి విశేష ఆదరణ

మద్రిపాలెం : సంత అంటే అందరికీ సరదాగా ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ చౌకగా ఇంటికి కావాల్సిన ప్రతి వస్తువు లభించడం ఒక ఎత్తయితే మరో పక్క కాసేపు అలా తిరుగుతూ కావాల్సినవి కొనుగోలు చేసుకునే అవకాశం లభించటం మరో ఎత్తు. ఈ క్రమంలో 51వ వార్డు మాధవధార 48 లాస్ట్ బస్టాప్ మొదలుకుని అరకిలోమీటర్ మేర ఆ రోడ్డుకు ఇరువైపులా అనేక షాపులు ఏర్పాటు చేసుకుని విక్రయదారులు సంత నిర్వహిస్తారు. ఈ సంత ప్రతి గురువారం సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది. ఇక్కడ రూ.5 మొదలుకుని రూ.500 పైబడి ఇంటికి కావాల్సిన అన్ని వస్తువులు లభ్యమవుతాయి. మహిళలు ఎక్కువగా ఇక్కడికి వచ్చి అన్ని సామాన్లు కొనుగోలు చేస్తారు. ఒక్క మహిళలే కాదు వృద్ధులు, పురుషులు, పిల్లలు, ఇటు ఆర్ అండ్ బి నుండి అటు మురళీనగర్ వరకు ఉన్న ప్రజలు వందలాది సంఖ్యలో ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు. ఈ సంతలో కూరగాయలు, ప్లాస్టిక్ వస్తువులు, చీపుర్లు, ఇనుప వస్తువులు, మూకుడులు, కత్తిపీటలు, డైనింగ్ టేబుల్ కవర్లు, ఆడవారికి, పిల్లలకి కావాల్సిన దుస్తులు, క్లిప్పులు, రబ్బర్ బ్యాండ్లు, ఆట వస్తువులు, చెప్పులు, దుప్పట్లు, హ్యాండ్ బ్యాగ్‌లు, వంట సామగ్రి, పువ్వులు, పండ్లు, కుండలు, మట్టి పాత్రలు, తినేందుకు పానీపూరీ, చాట్ ఇలా ఒకటేంటి అన్నీ దొరుకుతాయి. అందుకే గురువారం వచ్చిందంటే ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సంతకు రావడానికి ఆసక్తి చూపుతారు. ఇక్కడ పేద, ధనిక అన్న భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు వచ్చి కావాల్సినవి కొనుగోలు చేస్తారు. అలాగే అంధులు ఇక్కడ పాడుతుంటారు. పుట్టుకతో పోలీయోతో ఉన్న ఓ వికలాంగుడు ఇక్కడ సంతలో పాటలతో తన వినూత్న డ్యాన్సుతో అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటాడు. ఏది ఏమైనా గుమ్మంలోనే ఇలా సంత జరగటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దుస్తులు కొనుగోలు చేస్తున్న జనం



ఇనుప పెనాలు, మూకుడులు, కత్తిపీటల అమ్మకాలు

ఘనంగా పుట్ట బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పుట్ట బంగారమ్మ, సుబ్రహ్మణ్యస్వామి

సీతంపేట : అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో కొలువైన పుట్ట బంగారమ్మ, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ శర్మ స్వామి వారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ జరిపారు.

వీధి లైట్లు వెలిగించరూ..

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో వీధిలైట్లు మరమ్మతుకు గురై చీకట్లు అలుముకున్నాయని, వెంటనే మరమ్మతు చేసి వీధిలైట్లు వెలగించాలని కాలనీవాసులు కోరారు. కేఆర్ఎం కాలనీలోని డోర్ నంబర్ 53–36–3/1 ఇంటి ఎదురుగా వున్న 41/బి10/1 పోల్ నంబర్‌కు సంబంధించిన వీధిలైట్లు గత 15 రోజులుగా వెలగడం లేదని పేర్కొన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్ : జోన్–2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి ఎఫ్‌సీఐ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భాస్కర్‌గార్డెన్స్, ఎఫ్‌సీఐ పార్కు, శివనగర్, రామాలయం వీధి, మద్రిపాలెం వుడా లేఅవుట్, శివశివానీ పాఠశాల రహదారి ఏరియా, పోలీసు క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

జోన్–2 పరిధిలో..

కంచరపాలెం : జోన్–2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లో 11 కేవీ బర్మా క్యాంప్ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 14 శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకె నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, పాలిటెక్నిక్ కళాశాల, నలందనగర్, దేవేంద్రనగర్, కంచరపాలెం రైతుబజారు, రవీంద్ర నగర్, ఇంటెలిజెన్స్ కార్యాలయం ఏరియా, అశోక్‌నగర్, గంగన్ననగర్, జోగారావునగర్, తిక్కవానిపాలెం, ధర్మానగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలి కోరారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా



పైడి శ్రీనివాసరావు

మద్రిపాలెం : రాష్ట్ర కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి విశాఖ ఉత్తర నియోజకవర్గం 51వ వార్డుకి చెందిన పైడి శ్రీనివాసరావు రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ ఓటమి నేపథ్యంలో తన నామినేటెడ్ పదవికి నైతిక బాధ్యతగా రాజీనామా చేసినట్టు ఆయన బుధవారం తెలిపారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీకి తన రాజీనామా పత్రాన్ని పంపినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

పాఠశాలలకు విద్యా కానుకలు



జ్యోతినగర్ స్టాక్ పాయింట్ నుంచి విద్యా కానుకలు తరలిస్తున్న ఎంఈవోలు, సిబ్బంది

కంచరపాలెం : గోపాలపట్నం మండల పరిధిలో పాఠశాలలకు 2024–25 విద్యా సంవత్సరానికి విద్యా కానుకలు మండల విద్యా శాఖాధికారులు–1,2 సోమేశ్వరరావు, దివాకర్ పర్యవేక్షణలో బుధవారం పంపిణీ చేశారు. మద్రిపాలెం పరిధి జ్యోతినగర్ ప్రాథమిక పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి పాఠ్య పుస్తకాలు, బ్యాగులను ఆయా పాఠశాలలకు తరలించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండల పరిధిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సిబ్బంది త్వరితగతిన స్టాక్ తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు లంక చైతన్య, పద్మ, లలిత, మంజుల, పీటీఐలు భవానీ, సూర్యం పాల్గొన్నారు.

చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ వద్ద చేనేత హస్తకళా హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ప్రదర్శన బుధవారం సాయంత్రం ప్రారంభించారు. నిర్వాహకుడు సింహాద్రి సురేష్ ఆధ్వర్యంలో వుడా కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 28 వరకు నిర్వహిస్తామని నిర్వాహకుడు తెలిపారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాల చేనేత వస్త్రాలు, హ్యాండీక్రాఫ్ట్స్ అందుబాటులో ఉన్నాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింహాద్రి సురేష్ తెలిపారు.

చెత్త కుండీలనూ వదలడం లేదు..

సీతమ్మధార : ద్వారకానగర్‌లో పారిశుధ్యం క్షీణిస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి మెయిన్‌రోడ్డుని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌ల వద్ద గతంలో జీవీఎంసీ ఇనుప చెత్తకుండీలు ఏర్పాటు చేసింది. తడి–పొడి చెత్త కోసం వేర్వేరుగా రెండు బిన్లు ఏర్పాటు చేశారు. అయితే దొంగలు ఆ చెత్త కుండీలను చోరీ చేయడంతో ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుండీలు లేక ఫుట్‌పాత్‌ల మీదనే ప్రజలు, వ్యాపారులు చెత్త వేస్తున్నారు. దీంతో పారిశుధ్యం క్షీణిస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ద్వారకా క్రైం పోలీసులు స్పందించి చెత్తకుండీల చోరీలను నివారించాలని, స్క్రాప్ దుకాణాలపై నిఘా ఉంచి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.



చెత్తకుండీ లేకపోవడంతో ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెత్త

ఘన వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

మహారాణిపేట : ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు కచ్చితంగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు–2016పై మాధవధారలో గల కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానా కట్టవలసి ఉంటుందన్నారు. తడి–చెత్త పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్ఆర్‌కే రావు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అదనపు ఎగ్జికూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీరామ చంద్రమూర్తి, పోర్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీవీఎస్‌టీ మూర్తి, జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, జిందాల్ కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.సతీష్, అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ

మందుబాబుల అడ్డా.. రాధాకృష్ణ లేఅవుట్

సీతమ్మధార : అక్కడ సాయంత్రం అయితే చాలు ఎక్కడెక్కడి నుంచో మందుబాబులు వచ్చి వాలిపోతారు. ఇక పేకాటరాయుళ్లు ఉండనే వున్నారు. ఇదేదో నగర శివారు ప్రాంతం అనుకుంటే పొరపాటు పడినట్టే. జీవీఎంసీ 14వ వార్డు పరిధిలో గల రాధాకృష్ణ లేఅవుట్ కొండ ప్రాంతం గురించే ఇదంతా. ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా మారిపోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోజూ ఇక్కడ పేకాటరాయుళ్లు, మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో సాయంత్రం పూట మహిళలు బయటికి రావాలంటేనే హడలిపోతున్నారు. దీనికి తోడు రాత్రిపూట వీధిలైట్లు కూడా వెలగకపోవడంతో ఈ ప్రాంతం అంతా చీకటిమయంగా తయారవుతోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద కూడా అధికంగా ఉంటుంది. రోజూ ఉదయాన్నే మందు సీసాలు, చెత్తా చెదారాలు శుభ్రం చేయలేకపోతున్నామని పారిశుధ్య సిబ్బంది హైరానా పడుతున్నారు.



మందుబాబుల అడ్డాగా మారిన రాధాకృష్ణ లేఅవుట్

వైభవంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



అనఘా లక్ష్మీ వారాహీ సహిత రాజశ్యామల అమ్మవారు



లక్ష పుష్పార్చనకు సిద్ధం చేస్తున్న పువ్వులు

దాబాగార్డెన్స్: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన అనఘా లక్ష్మి, వారాహి సహిత రాజశ్యామల అమ్మవార్ల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ సాయిదర్బార్ ప్రాంగణంలో గల అమ్మవార్ల సన్నిధిలో ఆలయ అర్చకులు శైవాగమ రీతిలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, మహాలక్ష్మి హోమం జరిపారు. మహిళలు, భక్తులు సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణ చేశారు. అర్చకుల వేద పఠనంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద ఎత్తున స్థానికులు అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీసాయి మేరు ట్రస్ట్ చైర్మన్ పీఎస్‌వీజీ ప్రసన్న, కార్యదర్శి పి. శ్రీనివాస శాస్త్రి, జి. రమ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి. సతీష్, ఎ. రామ్‌రాజ్, డాక్టర్ కె. వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట : సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ' అనే అంశంపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ శ్రీశ్రీ అలుపు లేని అన్వేషి అని, వెనుదిరగని సాహసి అన్నారు. జనం జీవనాడి తెలుసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రయోగశాలిగా, పదునైన విమర్శకుడిగా శ్రీశ్రీ వినుతికెక్కాడని అన్నారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన ముందుగా ఇటీవల దివంగతులైన సహృదయ సాహితీ సభ్యుడు టీపీఎస్ ఆచార్యులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.వి.ఎ స్.మూర్తి, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సి.హెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పని చేయని బోరుతో అవస్థలు



రాధాకృష్ణ లే అవుట్‌లో పని చేయని బోరు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధిలో గల రాధాకృష్ణ లే అవుట్‌లో ఒక బోరుబావి పని చేయక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడి 11/27 నంబర్ గల బోరు బావి రెండేళ్లుగా పని చేయడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు ఏళ్ల తరబడి బోరుబావి పని చేయకపోవడంతో దూరంగా వున్న బోరు వద్దకు వెళ్లలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్–3 నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కళాకారులను ప్రోత్సహించండి

మల్కాపురం: కళాకారులను ప్రోత్సహించే విధంగా చొరవ చూపాలని కోరమాండల్ సంస్థ యాజమాన్యానికి గాజువాక మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు బుధవారం వినతి పత్రం అందజేశారు. సినీ కళాకారులమైన తమకు సరైన అవకాశాలు లభించక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని,తమ సంస్థ ద్వారా కళాకారులచే కార్యక్రమాలు నిర్వహించి ఆదుకోవాలని కోరారు. దీనిపై కోరమాండల్ అధికారులు సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.అధికారులను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు గుడివాడ శ్రీనివాసరావు,పైడిరాజు నూనెల, వెంకటేశ్వరరావు,అల్లు జోగినాయుడు, దుబాయ్ రాజు,శరత్,జ్యోతికుమారి,మంగ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే

సీతంపేట : ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్, స్వంతన సేవా సమితి సంయుక్తంగా ముద్రించిన 'బాలల హక్కులు.. చట్టాలు' పుస్తకావిష్కరణ సభ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను సమస్యగా కాకుండా సవాలుగా చూడాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని నిజాయితీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులకు అవగాహన లోపం వల్ల విద్యార్థులు బాలకార్మికులుగా మారుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ సెంటర్ కార్యదర్శి డాక్టర్ సత్యమూర్తి, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన దువ్వూరి సరోజిని



సరోజినిని సత్కరిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : కైలాసపురంలో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకత్వం చేస్తున్న దువ్వూరి జోగులాంబ, రాజేశ్వర్రావుల కుమార్తె దువ్వూరి సరోజిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఇటీవల అయోధ్యలో భారతి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఆఫ్ యూపీ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2024 పోటీలో సత్తా చాటింది. ఆంధ్రప్రదేశ్ తరపున సరోజిని పాల్గొని స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించింది. 100 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, 400 మీటర్ల పరుగు పందెంలో రజతం, 5 కిలోమీటర్ల నడకలో కాంస్యం సాధించింది. తెలుగు రాష్ట్రానికి చెందిన సరోజిని ఈ విధంగా మూడు విభాగాలలో మూడు పతకాలు సాధించడం ఎంతో గర్వంగా ఉందని ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి అమరేంద్రరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

సరోజినికి సత్కారం..

విశాఖ చేరుకున్న సరోజినిని బుధవారం వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైద్, యూత్ చైర్‌పర్సన్ వంశీ ఘనంగా సత్కరించారు. తనకు సహకరించి, ప్రోత్సహించిన జనకులం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ చింతలపాటి సత్యదేవ్, యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ వంశీ, వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్‌బైద్‌కు, తన తల్లితండ్రులకు సరోజిని కృతజ్ఞతలు తెలిపింది.

పక్కాగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి

ఆరిలోవ: చినగదిలి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, నోట్ పుస్తకాలు ఉన్న కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఎంఈవోలను ఆదేశించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాల కేంద్రాన్ని ఆయన విద్యా విభాగం అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. చినగదిలి మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఆయా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు వచ్చాయా? లేదా? తదితర వివరాల గురించి ఎంఈవోల ద్వారా తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇక్కడ కేంద్రంలో ఉన్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూలు కిట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పుస్తకాల కిట్లను జాగ్రత్తగా మండలంలో అన్ని పాఠశాలలకు పంపిణీ జరిగేటట్లు ఎంఈవోలు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. మండలంలో 72 పాఠశాలల్లో 13,148 మంది విద్యార్థులున్నారన్నారు. వారిలో ప్రస్తుతం 83 శాతం మందికి పాఠ్య పుస్తకాలు రాగా, 100 శాతం మందికి సరిపడా నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. షూలు 80 శాతం, బెల్టులు 55 శాతం మందికి సరిపడా వచ్చినట్లు తెలిపారు. ఇంకా యూనిఫారం రాలేదని, కొద్ది రోజుల్లో రానుందని, వచ్చిన వెంటనే సరఫరా చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ్య పుస్తకాల కిట్లు పంపిణీ రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన, ఎంఈవో–1 రవీంద్రబాబు, ఎంఈవో–2 అనురాధ, భవిత కోఆర్డినేటర్ గీత, పీఎంవో అప్పలనాయుడు, పీఆర్పీలు అప్పలరాజు, రాంబాబు, మండల కో–ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.



తోటగరువు పుస్తకాల కేంద్రంలో పాఠ్య పుస్తకాలు, రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

అనాథ బాలలకు ఎంబీఏ విద్యార్థుల చేయూత

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన విద్యార్థులు సామాజిక సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. విద్యార్థులు విశాఖ పరిధిలోని 7 అనాథాశ్రమాలకు చెందిన 195 మంది బాలలను కళాశాలకు బుధవారం తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త తరుణ్‌కుమార్ మాట్లాడుతూ అనాథాశ్రమాల్లోని ఇబ్బందులను గుర్తించి వారికి సహకారం అందించేందుకు ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. వైద్య సేవలు అందించిన వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆశ్రమాల్లోని బాలలు ఆరోగ్యం, దంతాలను పరిరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తర్వాత బాలలకు వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ అనాథ బాలల కోసం 'కర్తవ్య' పేరుతో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఆశ్రమాలకు కావల్సిన నిత్యావసర వస్తువులతోపాటు ఫ్యాన్లు, దుస్తులు, స్కూల్ బ్యాగ్‌లు, కిరాణా సామగ్రి, స్టేషనరీ అందించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతులు సన్యాసిరావు, బి.చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

నందగిరి కాలనీలో చోరీ

- 160 గ్రాముల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ

సీతమ్మధార : ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందగిరి కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా. అక్కయ్యపాలెం నందగిరి కాలనీలోని రామలక్ష్మి అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న సూర్య ప్రకాష్‌రావు ఎల్‌అండ్‌టీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో బంధువుల ఇంట్లో పెళ్లికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి బుధవారం వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూసేసరికి బీరువా తలుపులు తీసి దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని లాకర్ చూడగా 160 గ్రాముల బంగారం, రూ.లక్ష నగదు కనిపించలేదు. దీంతో ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం డీసీపీ పి.వెంకటరత్నం, సీఐ ఎస్.ఆదాం, ఎస్ఐ, కె.భాస్కరరావు,తో పాటు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తో పరిశీలించారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.